## వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రం అందజేశారు. గుడిలోవ విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను నేషనల్ హెల్త్ మిషన్ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు కలిసి సమస్యలను వినత పత్రం అందజేశారు. 2002లో డీఎస్సీ ద్వారా ఎంపికైన వారిని ఇప్పటివరకు రెగ్యులేషన్ చేయలేదన్నారు. ప్రతి ఏడాది ఇచ్చే ఐదు శాతం డీఏను పెంచాలన్నారు. ఉద్యోగ భద్రతను కల్పించి ఉద్యోగుల మాదిరిగా ప్రతి ఏడాది టీఏడీఏ అందించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో విశాఖపట్నం జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా సెక్రటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్, జిల్లా టీబీ కంట్రోల్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎంవివి గోపీనాథ్, ఎల్టీలు సంఘం జాయింట్ సెక్రెటరీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇంటింటికి వైద్య సేవలు

### రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్

విశాలాంధ్ర - ఆనందపురం: గ్రామాలలో ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ వైద్య విద్యా శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం గుడిలోవ విజ్ఞాన విహార్‌లో హెడ్గేవార్ నూతన ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలను యూనిట్లుగా తీసుకొని, రాబోయే 6 నెలలులో ఇంటింటికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా స్త్రీలలో వచ్చే వివిధ రకాల కేన్సర్స్‌కు స్క్రీనింగ్ వైద్యం ఆయుష్మాన్ భారత్ ద్వారా అందుతోందని దీనిని అందరూ వినియోగించుకోవా లన్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డా. సి.వి.రావు మాట్లాడుతూ నేటి వర్తమాన పరిస్థితులలో మానవ జీవనశైలిలో వచ్చిన పెనుమార్పుల వలన అధిక రక్తపోటు, మధుమేహం వంటివి చిన్న వయస్సులోనే వస్తున్నాయని, సాంకేతిక సమాచారాన్ని తన విజ్ఞతతో తగు మోతాదులో ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి ఆర్.ఆర్.ఎస్.ఎస్. కార్య కారిణి సభ్యులు మాననీయ భాగయ్య మాట్లాడుతూ మన వ్యవసాయ సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి గో ఆధారిత సేంద్రియ పద్ధతి ద్వారా సాగు చేయాలని, రైతులందరూ దీనికి సంకల్పించి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. వ్యవసాయ, కుటీర ఉత్పత్తులు ప్రోత్సాహం పెరగడం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమౌతుందని, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు గ్రామాల్లోనే ఉపశమనం లభించే ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వీరితో పాటుగా కమిటీ కార్యదర్శి జి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.వెంకట ప్పడు, అధ్యక్షులు వి.వి. నారాయణరావు పాల్గొనగా అఖిల భారత విద్యా భారతి అధ్యక్షులు, విజ్ఞాన విహార డైరెక్టర్ గొ. దూసి రామకృష్ణరావు మాట్లాడుతూ ముఖ్యంగా గత 40 సంవత్సరాలుగా హెడ్గేవార్ ఆసుపత్రి కొనసాగిస్తున్న సేవలు, గ్రామాల్లో గర్భిణిలకు ప్రసూతి సేవలు ఇలా ఎన్నో రకాల వైద్య సేవలను విస్తృతం చేస్తూ ఆరోగ్యకరమైన సమాజానికి డా. హెడ్గేవార్ ఆరోగ్య కేంద్రం సేవలు కొనసాగిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, ఆశా కార్యకర్తలు, మెడికల్ ఆఫీసర్స్, వైద్య వృత్తిలో ఉన్న పూర్వ విద్యార్థులు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి దంపతులు, తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ పి.సుధా దంపతులు, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి టిఎస్ ఠాకూర్, పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు, చోడవరం ఎమ్మెల్యే రాజు తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఆనంద్ కుమార్ పూలమాల అందజేసి ఘన స్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్నారు. ఏఈఓ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అక్కయ్యపాలెంకు చెందిన ఎస్.నాగేశ్వరరావు నిత్యాన్న ప్రసాద పథకానికి లక్ష రూపాయలు విరాళాన్ని ఏఈఓ ఆనంద్ కుమార్‌కు అందజేసారు.

## కామ్రేడ్ చెల్లూరు అప్పారావు సంస్మరణ సభ

విశాలాంధ్ర - భీమిలి: భారత కమ్యూనిస్టు పార్టీ భీమిలి ఏరియా సభ్యులు కామ్రేడ్ చెల్లూరు అప్పారావు సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కానూరు రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మోర అప్పలరాజు మాట్లాడుతూ కామ్రేడ్ అప్పారావు తొలితర కమ్యూనిస్టులలో ఒకరని, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని కడవరకు కూడా ఎర్రజెండా రాజ్యం రావాలని సోషలిజం కార్మిక రాజ్యం కావాలని చివరి వరకు ఎర్ర జెండా పట్టుకుని నిస్వార్థంగా పనిచేసిన వ్యక్తని కొనియాడారు. కామ్రేడ్ అల్లు బాబురావు మాట్లాడుతూ కామ్రేడ్ అప్పారావు మనలో లేకపోవడం బాధాకరమని అన్నారు. భీమిలి ఏరియా సిపిఐ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ 1960లో తూర్పు ఉద్యోగం కొరకు వచ్చి కమ్యూనిస్ట్ భావాలు అలవర్చుకొని యూనియన్‌లోనే చురుకైన పాత్ర పోషించిన నిస్వార్థ జీవని కొనియాడారు. కామ్రేడ్ చెల్లూరు అప్పారావు కుమారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయనను తన తండ్రిగా చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.అప్పారావు, వీర్రాజు, బాబ్జి, గోవిందా, సత్యం, లక్ష్మణరావు, సూర్యనారాయణ, రాము చంద్రరావు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిషేధానికి సోషల్ మీడియా ప్రభావశీలుల సహకారం స్ఫూర్తిదాయకం

### - జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి చైతన్య వంతంతో సహకరిస్తూ ముందడుగు వేసిన సామాజిక మాధ్యమ ప్రభావశీలులు (సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్) అందించిన సామాజిక సహకారం అభి.నందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఆయన జీవీఎంసీ, వైజాగ్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్నాకమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆర్కే బీచ్ సమీపంలో నిర్వహించిన ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ కార్యక్రమానికి పుష్ప-2 చిత్రం నటి కుమారి పావని, జీవీఎంసి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ ముందుకు వచ్చిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ సామాజిక బాధ్యతతో అందిస్తున్న సహకారం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయ కమని పేర్కొంటూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు కమిషనర్ తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విశాఖ నగరంలో 2025 జనవరి ఒకటి నుండి నిషేధించడ మైనదని, అందుకు ముందస్తుగా 45 రోజులపాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించడమైనదన్నారు. నగరంలో ప్లాస్టిక్ వస్తువులను అన్నిటినీ జీవీఎంసీ నిషేధించలేదని, ఈ విషయాన్ని ప్రజలందరూ ముఖ్యంగా గమనించాలని, తిరిగి పునరుత్పత్తికి ఉపయోగపడని ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే నిషేధించడమైనదని, అనగా 120 మైక్రాన్ల లోపు ఉన్నటువంటి ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా విశాఖ నగరంలో నిషేధించినట్టు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు ప్రతి మనిషి జీవితంలో విడదీయరాని బంధంతో ముడిపడి పోతున్నాయన్నారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్. సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన కలిగే అనర్థాలు, ప్రత్యామ్నాయాలు వినియోగం వలన కలిగే లాభాలు తదితర విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్. వర్మ, డి.వి.రమణమూర్తి, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, సహాయ వైద్యాధికారులు డాక్టర్లు కిరణ్ కుమార్, సునీల్ కుమార్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ని అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలి

### విశాఖలో వామపక్ష పార్టీల నిరసన

విశాలాంధ్ర - విశాఖ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా అవమానకర వ్యాఖ్యలు చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, జిఎస్‌జె అచ్యుతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులు డిమాండ్ చేసారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్షపార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సంద్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా, సమర్థించిన ప్రధాని నరేంద్రమోడీలపై పోలీస్‌లు కేసులు పెట్టకుండా వామపక్ష పార్టీల కార్యకర్తలపై విరుచుకు పడటం సరైనదికాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంబేద్కర్‌ను ప్రేమిస్తుంటే మన దేశంలో మనువాదులు మాత్రం అంబేదర్‌ను ద్వేషిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పద వులు చేపట్టిన బిజెపి మనువాదుల అసలు స్వరూపం బయట పడిందన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పాలకవర్గాలు దానికి తూట్లు పొడవటమే కాకుండా అంబేద్కర్‌ను కూడా అవమానిస్తే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. దేశానికి ప్రజాస్వామ్యం కావాలి. మనువాద సిద్ధాంతం వద్దు, రాజ్యాంగాన్ని రక్షించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు ఎం.కృష్ణారావు, ఎస్‌కె రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎండి బేగం, ఎం.శ్రీనివాసరావు సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు దేవా, వామపక్ష నాయకులు ఎం.సుబ్బా రావు, ఎం.వెంకటేశ్వర్లు, కె.కుమారి, తదితరులతోపాటు వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్‌ఎంపీ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: గ్రామీణ వైద్యులు సమస్యలపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యప్రసాద్‌కు ఆదివారం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గుడిలోవ విజ్ఞాన విహార్ నందు ఆరోగ్య కేంద్రం ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రివర్యులు వై.సత్య ప్రసాద్‌కు ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, ఆర్‌ఎంపి వ్యవస్థాపధ్యక్షుడు జంగం జోషి, ఆర్‌ఎంపీ సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. 2008లో నాటి ప్రభుత్వం వారికి 429 జీవో ఇచ్చి, ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు నాలుగు సంవత్సరాలు శిక్షణ ఇచ్చిందని, అర్ధరాంతరంగా- 2012లో కొనసాగుతున్న శిక్షణ తరగతులు ఆగిపోయాయని ఆ శిక్షణను పున: ప్రారం భించాలని కోరారు. అందుకు సంబంధించి, నాటి ప్రభుత్వం ఇచ్చిన జీవోను, సర్క్యులర్ కాపీని, వారికోసం ప్రభుత్వం ఖర్చు చేసినటువంటి ఖర్చుకు సంబంధిత పేపర్లను వినతిపత్రంతో జత చేసి ఇచ్చినట్లు అధ్యక్షుడు జోషి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రవీంద్ర రెడ్డి, ఆర్.ఎం.పి. జోనల్ కోశాధికారి పచ్చిపులుసు కనకారావు, మండల అధ్యక్షులు. పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శి లోగిసా గణేష్, సభ్యులు కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామలింగేశ్వర స్వామి పరస

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధి 59వ వార్డు నక్కవానిపాలెం పరిధిలో గల కోదండ రామలింగేశ్వర స్వామి పరస ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించు కున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దూర ప్రాంతాల్లో నివాసం ఉండే తమ బంధువులను ఇళ్లకు పిలిచి వారితో సరదాగా గడిపేందుకు ఇటువంటి పరసలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు పేర్కొన్నారు.

## విద్యతో పాటు సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులు యువతకు విద్యతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను నేర్పించాలని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ గొర్లె రాము నాయుడు సూచించారు. పెందుర్తి క్రైట్స్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో 30 గ్రామాలలో జరుగుతున్న విద్యా వికాస కేంద్రాల నిర్వాహకులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన రామునాయుడు మాట్లాడుతూ కేంద్రాలను నెలకొల్పడం ఆనంద దాయకంగా ఉందని చదువులో ముందుండి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు వారి జీవితంలో ఉపయోగపడే అంశాలను బోధించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్ నిర్వాహకులకు ట్రైనింగ్ ఎలా ఇవ్వాలి అనే దానిపై తర్ఫీదు ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, జిల్లా కోఆర్డినేటర్ వనజ, జిల్లా కోఆర్డినేటర్ గౌరీ నాయుడు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కుకు రివైవల్ ప్యాకేజీ పట్ల హర్షం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నష్టాల ఊబిలో నుండి బయట పడేసి ప్రభుత్వ రంగములోనే కొనసాగేలా రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుండి సుమారు 11,440 కోట్ల రివైవల్ ప్యాకేజీ సాధించిన సందర్భంలో దీనికి ముఖ్య కారకులు అయిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, మంత్రి, యువ నేత నారా లోకేష్ బాబుకి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి, విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్‌కి, గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుల చిత్రపటాలకు విశాఖ పార్లమెంటరీ నియోజక వర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గోక్యాడ ముత్యాలు, ములకలపల్లి పెంటయ్య, శ్రీముసిరి శ్రీనివాస రావు 75వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్, కిలాన ముసలయ్య, ఊరుకుటి వెంకటరావు, బొంగు రాజు,మొల్లి రమణ బాబు, ఊరుకుటి అప్పల రాజు, పెద్దాడ సోము నాయుడు,టేకేటి పెంటయ్య టేకేటి అప్పారావు, మొల్లి అప్పారావు,మొల్లి రమణ, మొల్లి అప్పల నాయుడు, బస అప్పల రెడ్డి, గొందేసి అప్పల రెడ్డి, కేత మురళీ తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

విశాలాంధ్ర - భీమిలి: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తగరపువలస వై జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ 11,440 కోట్ల ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమే అని అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో విఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పార్టీ డివిజన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో జరిగిన చర్చ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరారు.

వ్యవసాయంపై ఆధారపడిన దేశంలో రైతులు 56 రోజుల నుంచి ఉద్యమం చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్ర మంలో పార్టీ నాయకులు ఎస్.అప్పల నాయుడు, భాగం లక్ష్మి, సీఐటీయూ నాయకులు నీలాతి రాము, జోగ ఆనంద్, జీరు సత్యారావు పాల్గొన్నారు.

## మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ద్వారా 35 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నగరంలోని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్లో 35 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ పొందారు. ఈ సందర్భంగా మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరదా రవి కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంపస్ డ్రైవ్ ఎం/ఎస్ భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అసోసియేట్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ స్థానం కోసం ఇంటర్వ్యూలు నిర్వహించబడిందని తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్లో 250 మంది బీటెక్ తాజా పట్టభద్రులు/ గ్రాడ్యు యేట్లు పైథాన్, జావా, నెట్‌లో మంచి నైపుణ్యాలు ఉన్నవారు పాల్గొన్నారన్నారు. వీరిలో 35 మందికి ప్లేస్‌మెంట్ లభించిం దన్నారు. రవి కుమార్ 17 ఆగస్టు 2024 న నిర్వహించిన మరో క్యాంపస్ డ్రైవ్‌లో 45 మంది సీయస్ఈ విద్యార్థులు ప్లేస్మెంట్ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే, భవిష్యత్తులో మరిన్ని జాబ్ ఫెయిర్స్ క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించే యోచనలో ఉన్నామని తెలిపారు. మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ప్రస్తుతం డేటా సైన్స్, ఏ డబ్ల్యు ఎస్, డెవ్ఓప్స్, ఫుల్ స్టాక్ డెవల ప్మెంట్ వంటి ట్రెండింగ్ కోర్సులను పరిశ్రమకు అనుగుణంగా, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్ర మంలో మిలీ నియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ జి.సాగర్, భార్గో ఇన్నోవేషన్స్ నుండి అసిస్టెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ వై.వి.రాజు, టీమ్ లీడ్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తరగని ఆస్తి విద్య మాత్రమే: సీఐ

విశాలాంధ్ర - పద్మనాభం: ఎంత పంచిపెట్టినా తరగని ఆస్తి విద్య మాత్రమేనని, మన యువతే మన దేశ సంపద అని పద్మనాభం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ శ్రీధర్ పేర్కొన్నారు. భారతదేశ ప్రభుత్వ రంగ సంస్థ నెహ్రూ యువ కేంద్ర, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో పద్మనాభం మండల కేంద్రంలో ఉన్న గోస్తనీ విద్యాపీట్ పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన స్వామి వివేకానంద యువజన వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యను ఎంత నేర్చుకుంటే జీవితంలో అంత ఫలితాలు సాధించ వచ్చునన్నారు. దేశంలో ప్రతి యువత వివేకా నందుని అడుగుజాడలలో నడవాలని, విద్యలోనూ, క్రీడలలోనూ, సామాజిక సేవలలోనూ పాల్గొని ఆయన ఆశయాలను సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమానికి ముందుగా స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వివేకానందుని చిత్రపటానికి సీఐ శ్రీధర్, పలువురు పెద్దలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలను సీఐ శ్రీధర్ ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ వాయు నందన రావు, గోస్తని విద్యాపీట్ కరస్పాండెంట్ కాళ్ళ సూరిబాబు, తమటపు నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సిరిపురపు వెంకటరావు , మత్స సోమేశ్వరరావు, పాలూరి కృష్ణారావు, మరగడ గౌరీరెడ్డి, చప్ప కృష్ణ, కడితి ఈశ్వరరావు, తమటపు హేమ, కంటుబోతు సత్యవతి, అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సోములును సత్కరించిన తెలంగాణ టీడీపీ

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గడచిన 40 ఏళ్లుగా టీడీపీ పార్టీకి ఎనలేని సేవలను అందించిన నందవరపు సోములును తెలంగాణ రాష్ట్ర టీడీపీ సత్కరించింది. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమం, మెడికల్ క్యాంపు మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలపై పలువురు ప్రసంగించారు. అలాగే బడుగు, బలహీన వర్గాల వారికి ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పురోగతికి విశిష్ట సేవలను అందించిన పలువురిని సత్కరించడం జరిగింది. సోములు నాటి నుండి టీడీపీని విడవకుండా, పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టకాలంలో పార్టీకి విస్తృత సేవలు అందించి ప్రజలకు టీడీపీ సంక్షేమ పథకాలు, టీడీపీ సిద్ధాంతాలను ప్రజల మధ్యకు తీసుకు వెళ్లడంలో ఎంతో కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర కమిటీ మాజీ అధ్యక్షులు బక్క నరసింహులు అన్నారు. అనంతరం సోములును పార్టీ ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టిడిపి ఐటి డిపార్ట్మెంట్ చైర్మన్ టి.హరికృష్ణ, తిరుపతి బోర్డు సభ్యులు నర్సిరెడ్డి మామిడాల బిక్షపతి చారి పాల్గొన్నారు.

## కార్మిక సంఘాలపై బిజెపి మాజీ ఎమ్మెల్సీ తప్పుడు వ్యాఖ్యలు సరికాదు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయవద్దంటూ త్రికరణ శుద్ధితో కార్మిక సంఘాలు పోరాటం చేస్తుండగా, బిజెపి మాజీ ఎమ్మెల్సీ మాధవ్ కార్మిక సంఘాలపై బాధ్యతారాహిత్యంగా ప్రకటనలు చేయడం సరి కాదని, ఆ ప్రకటనను ఆయన వెనక్కి తీసుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాధవ్ చేసిన ప్రకటన కుహనా రాజకీయ నాయకులు చేసే ప్రకటన వంటిదని ఎద్దేవా చేశారు. 1400 రోజులుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదని కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నాయని, ఒక్క రోజైనా కార్మికుల నిర్వహిస్తున్న శిబిరానికి వచ్చి మాధవ్ మద్దతు తెలిపారని ప్రశ్నించారు. ఆయన బాధ్యతారాహిత్యానికి ఇది ఉదాహరణ అన్నారు. ఆ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం నిర్వహిస్తున్న పోరాటం సాగుతున్న 1400 రోజుల కాలంలో, ప్రధాని మోడీ రెండు పర్యాయాలు విశాఖ నగరానికి వచ్చారని, అప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని ఆయన ఎందుకు ప్రకటించ లేదని అన్నారు. పొరుగునున్న తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోడీ వెళ్లి సింగరేణిని ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టంగా ప్రకటించడం జరిగిందన్నారు. అటువంటి ప్రకటన విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం అంటే పెట్టుబడి దారుల లాభం కోసం మాత్రమే అన్నారు. మాధవ్‌కు చిత్తశుద్ధి ఉంటే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని, ప్రైవేటీకరణ చేసేది లేదని మోడీతో ప్రకటన చేయించాలని కోరారు. అనేక త్యాగాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం కార్మిక సంఘాలుగా త్యాగాలు చేస్తున్నా మని, నిజాయితీగా పోరాటం చేస్తున్నామని, మాధవ్ వలే కుహనా రాజకీయాలు చేయడం లేదని, బిజెపి తప్పుడు పార్టీ అని ఆరోపించారు. ఇప్పటికైనా మాధవ్ తెలిసి తెలియని విధ ంగా మాట్లాడటం మానుకొని, నోరు అదుపులో పెట్టుకో వాలని లేకుంటే, తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

## ఘనంగా త్యాగరాజ ఆరాధ్య దినోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తిలో గల సూర్యనారాయణమూర్తి దేవాలయంలో సప్త స్వరాల సంగీత అకాడమీ ప్రతినిధి కొత్తపల్లి భానుమతి ఆధ్వర్యంలో 178 వ త్యాగరాజ ఆరాధ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద వెంకట సత్యనారాయణ, పెందుర్తి 96వ వార్డు టీడీపీ కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు పాల్గొని సూర్యనారాయణమూర్తి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం త్యాగరాజ ఆరాధ్య దినోత్సవం నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు గాయత్రి, చక్రవర్తి, సంగీత విభాగానికి చెందిన మద్దివర్తి జగదీశ్వరి, పలువురు సంగీత అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిష్కారాల కోసం ఈ విటారా

విశాలాంధ్ర- విశాఖపట్నం: డీకార్బొనైజేషన్‌కి, అందరి కోసం ప్రయాణించే ఆనందానికి కట్టుబడటం ప్రదర్శిస్తూ, మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) నేడు తమ మొదటి బీ ఈవీ ఎస్ యూవీ ఈ విటారా ఎలక్ట్రిక్ పర్యావరణ పరిష్కారాలతో పాటు భారత్ మొబిలిటి గ్లోబల్ ఎక్స్ పో 2025ని ప్రారంభించింది.

హార్ట్ టెక్ట్ ఈ ప్లాట్ ఫాం పై నిర్మితమైన ఈ విటారా గొప్ప సామర్థ్యాన్ని అమోఘమైన శ్రేణిని సాటిలేని సౌకర్యం భద్రతతో అందిస్తోందని మారుతి రిప్రజెంటేటివ్ డైరెక్టర్ తోషిహిరో సుజు కీ చెప్పారు.

ప్రీమియం నెక్స ఛానల్ లో పరిచయం చేయబడటానికి సిద్ధంగా ఉన్న ఈ విటారా నెక్సా కీలకమైన విలువైన వినూత్నత, ఆధునికత, ప్రీమియం కస్టమర్ అనుభవానికి చిహ్నంగా నిలిచిందన్నారు.

# ప్రమాణ స్వీకారం చేసిన వాసవి క్లబ్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి జిల్లా వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా కలగర్ల శేషగిరిరావు, అధ్యక్షుడిగా శ్రీనాథ వెంకట మాధవ (మధు) తదితర కార్యవర్గం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ.పి.రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్య నారాయణ, అంబికా గ్రూప్ అధినేత అంబికా కృష్ణ, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కూడా చైర్మన్ కర్నూల్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, వాసవి సత్ర సముదాయ కార్యదర్శి, మహిళా అధ్యక్షురాలు రావూరి రజనీ, ఏ.పి.ఆర్యవైశ్య మహాసభ కంచర్ల ముత్య ప్రసాద్, ఉపాధ్యక్షులు మాటూరి రంగనాథ్, చీఫ్ కో ఆర్డినేటర్ కారుమూరి మహేష్, వైద్య ఆరోగ్య కమిటీ చైర్మన్ గోపిశెట్టి నాగేశ్వరరావు, కొల్లూరు సత్యనారాయణ వైజాగ్ అర్బన్ ప్రెసిడెంట్ బెల్లాల పెంటబాబు, స్టీల్ సిటీ వైజాగ్ ప్రెసిడెంట్ ముమ్మల విశ్వేశ్వరరావు, పార్వతీపురం అధ్యక్షులు భక్తుల శ్రీనివాస్, స్టేట్ సెక్రటరీ ఏ గోవిందరాజు లు పాల్గొన్నారు. టిడిపి బిజినెస్సింగ్ నూతన కార్యవర్గంగా గౌరవ అధ్యక్షులు సి.ఎస్ కుమార్ (నర్సీపట్నం), అధ్యక్షులుగా శ్రీనాథ్ వెంకట మాధవ, గౌరవ అధ్యక్షులుగా కలగర్ల శేష గిరిరావు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ ఎస్. షణ్ముఖరావు, నుదురుమాటి శ్రీనివాసరావు, టీఎస్ గుప్తా, శ్రీనాథ్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ గా గోపిశెట్టి నాగేశ్వరావు (మాడుగుల), స్టేట్ సెక్రటరీ బి.రాజేష్, జాయింట్ సెక్రెటరీ బి ఎస్ వి రవికుమార్ సత్య, బి. సతీష్, బి మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పాడేరు కు చెందిన వాసవి క్లబ్ కార్యవర్గ సభ్యులు మెంబర్స్ సుమారు వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం మండలం గోవాడ జడ్పీ హైస్కూల్ లో 1989 - 90 ఏడాదిలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆత్మీయ, అనురాగాలతో మదినిండా సంతోషంతో తాము చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. వారు చదువుకున్న విద్యా దేవాలయమే ఇందుకు వేదిక అయింది. ఆదివారం గోవాడ జడ్పీ హైస్కూల్లో విద్యార్థులంతా తమ కుటుంబ సభ్యులతో వచ్చి ఆత్మీయ కలయిక లో భాగస్వాములయ్యారు. చదువుకున్న సమయంలో తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలు ఒకరికొకరు నెమరు వేసుకుంటూ పాఠశాలల్లో ఉన్న తరగతి గదుల వద్దకు వెళ్లి గుర్తు చేసుకొని ఆనందం పొందారు. 34 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులంతా ఒకరికి ఒకరు కలుసుకొని పరిచయాలు చేసుకుంటూ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఆప్యాయంగా ఆనందం పొందారు. ఈ సందర్భంగా ఆ సమయంలో పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేస్తూ వారి ఆశీస్సులు పొందారు. ఉపాధి రీత్యా ఇతర దేశాలలో ఉన్న వారి సైతం ఈ ఆత్మీయ కలయికలో పాల్గొని చిన్నపిల్లల మాదిరిగా వయసు తో పని లేకుండా ఆటపాటలతో సరదాగా గడిపారు. తాము చదువుకున్న హై స్కూల్ కి ఏదైనా సహాయం చేద్దామని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన నిర్వాకులు గుడిమెట్ల సత్యనారాయణ, బుద్ధ గంగేశ్వరరావు, బొడ్డేడ శివాజీ, కొయిలాడ నాగేశ్వరరావు గంగరాజు, దాడి జగదీష్, కే దివాకర్, వేదువాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుబడ్డ లంకె బిందెలు ముఠా

## దొంగ స్వామీజీల పేరుతో సుమారు 28 లక్షల టోకరా.. మోసపోయిన బాధితులు.... ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన...

విశాలాంధ్ర - ఆనందపురం: మేము స్వామీజీలమంటూ మా వద్ద అతీత శక్తులు, మంత్రాలు ఉన్నాయని నమ్మించి మోసం చేస్తున్న దొంగ బాబాలముఠా కోణం బయటపడింది. మీరు 30 లక్షలు ఖర్చు పెడితే తక్కువకాలంలో అపర కోటీశ్వరులు అయిపోతారని మాయమాటలు చెప్పి, నమ్మించి మభ్యపెట్టి సుమారు 28 లక్షల వరకు బాధితుల నడి వసూలు చేసినట్లు తెలుస్తోంది. లంకె బిందెలు పేరుతో మోసానికి పాల్పడి సుమారు 28 లక్షలు వసూలు చేసిన ఘరానా మోసగాళ్లు పట్టుబడ్డారు. ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసినా మోసగాళ్లు రోజుకో రకంగా పుట్టుకొస్తున్నారు ఈ కేటుగాళ్లను నమ్మి ప్రజలు మోసపోతున్నారు తాజాగా ఆనందపురం మండలంలో లంకె బిందెలతో అతి తక్కువ కాలంలోనే కోటీశ్వరులు అయిపోతారంటూ ఒక నలుగురు వ్యక్తుల్ని బాగా నమ్మించి వారి వద్ద నుండి సుమారు 28 లక్షల వరకు వసూలు చేసినట్లు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. కేటుగాళ్లు వారి వద్ద నుంచి డబ్బు తీసుకొని మంత్రాలతో మంత్రిచిన లంకెబిందెలను వారికి అందజేస్తామని గుడ్డిగా నమ్మించి బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. మల్కాపురానికి చెందిన పైడిపాటి వెంకట భార్గవరావు అలియాస్ మునిస్వామి (35) గాజువాక చెందిన దేరింగ్ కృష్ణకుమార్‌తో కలిసి మునిస్వామి ఆనందపురం మండలం వేమ గొట్టిపాలెం గ్రామానికి చెందిన కోంద్రోతు అప్పలరాజు (26) వద్ద లంకె బిందులు ఉన్నాయని నమ్మించారు ఈ క్రమంలో ఆనందపురం మండలం బిపి కల్లాలు ఎల్ల అప్పలరాజుతోపాటు, ఎల్ల అప్పలనాయుడు సత్యనారాయణ, సుధీర్, వీరి నుండి సుమారు 28 లక్షల వరకు కొంద్రోతు అప్పలరాజు సమక్షంలో మునిస్వామికి అందజేశారు. పూజలు చేస్తామని పూజలు చేస్తేనే లంకె బిందెలు తీసుకోవడం అవుతుందని లేకపోతే రక్తం కక్కుకొని చనిపోతారని మరికొంత కావాలని డిమాండ్ చేశారు అనుమానించిన బాధితులు మునిస్వామికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో ఇటీవల స్థానిక పోలీసులకు బాధితులు పిర్యాదు చేశారు బాధితులు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు విచారణ జరిపి అందిన సమాచారం మేరకు మార్టు వేసి ఆనందపురం బోనీ రోడ్లో బుద్దుడు విగ్రహం వద్ద ఆదివారం పట్టుకున్నారు. వీరి వద్ద నుండి పాత రాగి సామాన్లు, ఏపీ 39 యు ఆర్ 7521 షిఫ్ట్ వైట్ కారు లక్ష 70వేలు వరకు నగదు రికవరీ చేసినట్లు సమాచారం చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.వాసు నాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు. పైడిపాటి వెంకట భార్గవ రాజు ఆలియాస్ మునిస్వామి, ఎ2గా దేరింగ్ కుసుమరాజు, ఎ3 కొండ్రుతు అప్పలరాజును మెజిస్ట్రేట్ ముందు హాజరు హాజరు పరుస్తామని ఆనందపురం పోలీసులు వెల్లడించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## పెండ్యాల లావణ్యకు సావిత్రీభాయి పూలే
# జాతీయ ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్త్రీ విద్య, సమానత్వం,సాధికారతకు పాటుపడుతూ సేవలందించే ప్రతిభావంతులు ,నిష్ణాతులైన వారికిచ్చే సావిత్రీభాయి పూలే జాతీయ పురస్కారాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డా పెండ్యాల లావణ్య అందుకున్నారు.ఆదివారం గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో యస్ పి యల్ టి వో వారు ఈ అవార్డును అందజేసారు. కృష్ణ- గుంటూరు జిల్లాల పట్టభద్రుల యం యల్ సీ కె.ఎస్.లక్ష్మణ రావు ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో ఏ సి కాలేజి ప్రిన్సిపాల్ డా కె మోజేష్ ,మలినేని విద్యాసంస్థల డైరెక్టర్ మలినేని పెరుమాళ్ళ ,డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంగలకుదురు గాయిత్రీదేవి చేతుల మీదగా ఈ అవార్డు అందుకోవటం జరిగిందని లావణ్య తెలియజేసారు.ఈ కార్యక్రమంలో తన పేరు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో నమోదు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేయటం సంతోషంగా ఉందన్నారు.

సావిత్రీభాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న డా పెండ్యాల లావణ్యను ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు,తెలుగు విభాగ ఆచార్యులు ,పరిశోధక విద్యార్థులు,స్నాతకోత్తర విద్యార్థులు,తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందనలు తెలియజేసారు.